VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 91

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 5 సెప్టెంబర్ 2026

## ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు రేపు కీలక భేటీ

- పీఆర్సీ, కరవు భత్యం తదితర అంశాలపై చర్చించనున్న సీఎం
- నిన్న చంద్రబాబును కలిసిన ఏపీ జేఏసీ నేతలు
- ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ముఖ్యమంత్రి



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేపు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు. నిన్న సచివాలయంలో ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరు-స్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## కేరళలోని అమృతపురి ఆశ్రమాన్ని సందర్శించిన మంత్రి లోకేష్

### మాతా అమృతానందమయి దేవితో భేటీ





**అమృతపురి(కొల్లం),కలంకౌంటర్ :** కేరళ రాష్ట్రం కొల్లం జిల్లాలోని ప్రసిద్ధ అమృతపురి ఆశ్రమాన్ని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం సందర్శించారు. ముందుగా అమృతపురి ఆశ్రమానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలోని కాళీ దేవాలయాన్ని, కలరిని మంత్రి సందర్శించారు. అనంతరం శ్రీ మాతా అమృతానందమయి దేవితో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మాతా అమృతానందమయి దేవి ఆశీస్సులు పొందారు. అనంతరం అమృత విశ్వవిద్యాపీఠం క్యాంపస్ ను, అమృత ఆయుర్వేద కళాశాలను మంత్రి సందర్శించారు. దాదాపు మూడు గంటలపాటు ఆశ్రమంలో గడిపారు.

## సరికొత్తగా హస్త కళలు

- ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయల కళారూపాలు
- కళారూపాల తయారీలో 770 మంది కళారులకు శిక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ
- రూ.1.35 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- క్లస్టర్ల వారీగా శిక్షణ కార్యక్రమాలు
- 200 మందికి శిక్షణతో పాటు టూల్ కిట్ల అందజేస్తాం
- ఆదాయం, ఉపాధే లక్ష్యంగా హస్త కళాకారులకు శిక్షణ
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత







**అమరావతి,కలంకౌంటర్ :** మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1.35 కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770 మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ. 1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ. 1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా

- 2లో

## రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే: పవన్ కల్యాణ్

- పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు
- రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్
- పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు
- స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం



**విజయవాడ, కలంకౌంటర్ :** రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

**పుష్కర కాలంగా పన్ను ఎగవేత..** 2016 నుంచి కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

**గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం..** అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్పేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

**పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం..** పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

**ఇక ఉపేక్షించేది లేదు..** నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## స్థానిక ఎన్నికలే లక్ష్యం.. ఎన్డీయే సమన్వయ కమిటీ కీలక భేటీ


- ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ
- క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేయాలని నాయకుల నిర్ణయం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీర్మానం



**విజయవాడ, కలంకౌంటర్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్డీయే కూటమి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాల సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో అను-సరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకులు–కార్యకర్తల మధ్య ఐక్యత వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయాన్ని లక్ష్యంగా చేసుకుని పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయిలలో కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేయాలని తీర్మానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుని, ఐక్యంగా పనిచేయడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం: జగన్

- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్



**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ము-ఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

## ప్రత్యంగిరీ అమ్మవారి హోమం



**తమిళనాడు,కలంకౌంటర్ :** తమిళనాడు కుంభకోణం దగ్గర అయ్యావాడి ఊరిలో ప్రముఖ దేవాలయం , అత్యంత శక్తి మాన్వితమైన శ్రీశ్రీశ్రీ మహా ప్రత్యంగిరి అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిరీ హోమం లో పాల్గొన్న మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు.

## ధరల పెరుగుదలపై జానకి రామపురంలో నిరసన



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** పెరిగిన ధరలకు నిరసనగా బంటుమిల్లి మండల అఖిలభారత ప్రజాసంత్రం మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బంటుమిల్లి మండలం జానకిరామపురం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ధరలు తగ్గించాలని ధరలు నియంత్రణ కు ప్రభుత్వం బాధ్యత వహించాలని మహిళలు నిన్న దించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పర్చూరు ధనశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో నిత్యవసర సరుకులు ధరలు పెరుగుతున్నాయని పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వమే బాధ్యత తీసుకుని చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యవసర వస్తువు ధరలను అందించాలని డిమాండ్ చేశారు .మహిళా సంఘం బంటుమిల్లి మండల కార్యదర్శి మాజీ టి పద్మ మాట్లాడుతూ 45 రూపాయిలు ఉన్న పంచదార 75 అయిందని 110 రూపాయలు ఉన్న ఆయిల్ 150 రూపాయలు అయిందని ఇలాంటి పరిస్థితుల్లో పేదలు మధ్యతరగతి కుటుంబాలు బతకాలంటే బతుకు బరువు అవుతుందని ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పెరిగిన ధరలు తగ్గించేటట్టుగా చర్య తీసుకోవాలని కోరారు .ఈ కార్యక్రమంలో మహిళా సంఘం మండల అధ్యక్షురాలు లంకదాసులు సుజాత మండల కమిటీ సభ్యురాలు పొదిలి అనసూయ పసుపులేటి రామ కుమారి ఆదిలక్ష్మి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాజేటి శివ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## వేదగిరి గుప్తా దంపతులకు సత్కారం



**కావలి,కలంకౌంటర్ :** నెల్లూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షులుగా ఎన్నికైన అమరా వేదగిరి గుప్తా–విజయ దంపతులను 'వాసవి వనిత లెజెండ్స్' ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. వేదగిరి గుప్తా, విజయ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంఘ నాయకులు వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలుతెలియజేశారు.ఈ సందర్భంగా వేదగిరి గుప్తా, విజయ దంపతులకు శాలువాలు కప్పి, ప్రత్యేక జ్ఞాపికలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షుడిగా వేదగిరి గుప్తా నియామకం పట్ల వనిత లెజెండ్స్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన సారథ్యంలో సంఘం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని, సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత లెజెండ్స్ ఐపీసీ అనుమాలశెట్టి కామాక్షి, జోన్ చైర్మన్ దుగ్గిశెట్టి హేమలత, వైస్ ప్రెసిడెంట్ గీత, కో–ట్రెజరర్ నేరళ్ల రమాదేవి, సభ్యురాలు సునీతతో పాటు పలువురు ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఆశయాలను ఆచరణలోకి తెచ్చింది చంద్రబాబే: కాలవ శ్రీనివాసులు

- పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ పునాదులు వేశారన్న కాలవ శ్రీనివాసులు
- సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ చంద్రబాబు పాలన సాగిస్తున్నారని కితాబు
- ఎన్టీఆర్ కలలను నెరవేర్చేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారని వ్యాఖ్య



**విజయవాడ, కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయాలను నిబద్ధతతో ఆచరణలోకి తీసుకొచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కొనియాడారు. అనంతపురంలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ఆత్మగౌరవ పాలనే ధ్యేయంగా ఎన్టీఆర్ వేసిన పునాదులపైనే చంద్రబాబు నేడు సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ పరిపాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. తెలుగుజాతి వికాసం కోసం ఎన్టీఆర్ కన్న కలలను నెరవేర్చేందుకు చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వ్యవస్థలను ప్రక్షాళన చేస్తూ, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేలా 'దీపం' పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, కొత్త పింఛన్ల మంజూరు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని వెల్లడించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు పునరంకితం అవుతూ, పార్టీ శ్రేణులంతా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రైవేట్ కంపెనీలకు స్పేస్‌లో ఎందుకు చోటు? ఇస్రో ఛైర్మన్ సంచలన సమాధానం

- దేశ అవసరాలు తీర్చేందుకు ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం అవసరమన్న నారాయణన్
- ప్రస్తుతం 56 శాటిలైట్లు ఉండగా.. అవసరం వందల్లో ఉందని వెల్లడి
- స్పేస్ ఎకోసిస్టమ్ విస్తరణతో ఉద్యోగాలు పెరుగుతాయని వివరణ
- ప్రైవేట్ రంగానికి ఇస్రో పూర్తి సహకారం అందిస్తుందని వెల్లడి
- జీఎస్‌ఎల్‌వీ మార్క్ IIతో ఇప్పటివరకు అత్యంత బరువైన శాటిలైట్‌ను ప్రయోగం



**విజయవాడ, కలంకౌంటర్ :** దేశ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం పెరగడంపై వస్తున్న విమర్శలకు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ స్పందించారు. భారత్‌లో పెరుగుతున్న అవసరాలను ఇస్రో ఒక్కటే తీర్చలేదని స్పష్టం చేశారు. దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థతో పాటు మొత్తం స్పేస్ ఎకోసిస్టమ్ మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం దేశం వద్ద 56 శాటిలైట్లు ఉన్నాయని, కానీ అవసరం మాత్రం వందల సంఖ్యలో ఉందని నారాయణన్ తెలిపారు. అందుకే ప్రభుత్వం అంతరిక్ష రంగంలో సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ప్రైవేట్ సంస్థలు కూడా ఈ రంగంలోకి రావడం ద్వారా మరిన్ని శాటిలైట్లు తయారవుతాయని చెప్పారు. దీంతో ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ఈ కార్యకలాపాలకు ఇస్రో అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. ఇదిలా ఉంటే శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీ–ఎఫ్17 నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఈఓఎస్–05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. జీఎస్ఎల్‌వీ మార్క్ II వాహక నౌకతో ఇప్పటివరకు ప్రయోగించిన అత్యంత బరువైన శాటిలైట్ ఇదేనని నారాయణన్ తెలిపారు. జీఎస్ఎల్‌వీ మార్క్–II సామర్థ్యం తొలినాళ్లలో 1,536 కిలోలుగా ఉండేదని చెప్పారు. ఇప్పుడు దాని సామర్థ్యం దాదాపు 40 శాతం పెరిగిందన్నారు. తాజా ప్రయోగం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. కులశేఖరపట్నం స్పేస్‌పోర్ట్ నిర్మాణ పనులు షెడ్యూల్ ప్రకారం సాగుతున్నాయని నారాయణన్ వెల్లడించారు. మార్చి నాటికి ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. మరోవైపు గగన్‌యాన్ కార్యక్రమం కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. ఈ ఏడాదే తొలి మానవరహిత మిషన్‌ను చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

# సరికొత్తగా హస్త కళలు

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణివ్వనున్నట్లు వెల్లడించారు. గురు–శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురు–శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

**200 మందికి శిక్షణతో పాటు పనిముట్లు..** గురు–శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెక్క బ్లాక్ తయారీ, కలంకారి బ్లాక్ ప్రింటింగ్, దుర్గి రాతి శిల్పం, అగరుబత్తి తయారీ, తాటి ఆకుల కళ, కొబ్బరి చిప్పల కళ, శ్రీకాళహస్తి కలంకారి వంటి హస్తకళలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురు–చెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యువెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకు–వెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గి రాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రూవ్‌డ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రొగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా కార్యక్రమాలు కృష్ణా, గుంటూరు, ఎన్‌టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు



గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు.

**కళాకారుల ఆదాయం పెంపే లక్ష్యం..** ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, కళాకారుల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. సంప్రదాయ కళలను కాపాడుతూ ఆధునిక డిజైన్లు, మెరుగైన శిక్షణ, నాణ్యమైన పనిముట్లు అందించడం ద్వారా హస్తకళాకారులకు ఆర్థికంగా మరింత వెన్నుదన్నుగా ఉండేలా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. త్వరలోనే ఈ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించనున్నామని మంత్రి సవిత తెలిపారు.

## ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానించడం హర్షణీయం

- 5వ తేదీన ముఖ్యమంత్రితో జరిగే భేటీలో ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా వివరిస్తాం
- చర్చలు సానుకూలంగా సాగుతాయని ఆశిస్తున్నాం
- జేఏసీ సమావేశం వాయిదా -- ప్రభుత్వ స్పందనను బట్టి భవిష్యత్ కార్యాచరణ



**విజయవాడ, కలంకౌంటర్ :** ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం హర్షణీయ పరిణామమని ఏపీఎన్‌జీవో సంఘం నేతలు అలపర్తి విద్యాసాగర్, డి.వి. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 5వ తేదీన ముఖ్యమంత్రితో జరిగే భేటీ ఒక మంచి అవకాశంగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను కూడా చర్చించనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామని, పరస్పర చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని విశ్వసిస్తున్నామని విద్యాసాగర్, తెలిపారు . ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల మధ్య నిరంతర సంభాషణ కొనసాగడం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవడం ద్వారా పరిపాలన మరింత సజావుగా సాగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రితో సెప్టెంబర్ 5వ తేదీన ఉద్యోగ సంఘాల భేటీ జరగనున్న నేపథ్యంలో, అదే రోజు జరగాల్సిన ూూ జేఏసీ ఉద్యమ కార్యాచరణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు వారు వెల్లడించారు. ముఖ్యమంత్రితో జరిగే చర్చల ఫలితాలు, ప్రభుత్వం ఇచ్చే హామీలు, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ స్పందనను పరిశీలించిన అనంతరం తదుపరి సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. వేతన సవరణ కమిషనర్ నియామకం, ఇంటిరియామ్ రిలీఫ్, పెండింగ్ ణూ ల చెల్లింపు.. సరెండర్ లీవ్ తదితర బకాయిలు, హెల్త్ కార్డులు, పెన్షనర్లకు ఎడిషనల్ క్వాంటం పెన్షన్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల నోషనల్ ఇంక్రిమెంట్, కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తామని తెలిపారు. వీటి మీద చర్చలు ఉంటాయని తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలు, హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ఏపీఎన్‌జీవో సంఘం ఎల్లప్పుడూ ఉద్యోగుల పక్షాన నిలుస్తుందని వారు తెలిపారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించబడతాయన్న ఆశాభావంతోనే ముందుకు సాగుతున్నామని, ప్రభుత్వం కూడా ఉద్యోగుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ స్పందనను బట్టి ఉద్యోగ సంఘాల తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తాం. ఉద్యోగుల ప్రయోజనాలే ప్రధానంగా, ఐక్యంగా మరియు బాధ్యతాయుతంగా ముందుకు సాగుతామని ఏపీఎన్‌జీవో నేతలు విద్యాసాగర్, డి.వి. రమణ తెలిపారు.

## రాజ్యసభ 'హౌస్ కమిటీ' సభ్యుడిగా బీద మస్తాన్‌రావు



**కావలి,కలంకౌంటర్ :** రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్‌రావు యాదవ్ రాజ్యసభ ప్రతిష్ఠాత్మక 'హౌస్ కమిటీ' సభ్యుడిగా నియమితులయ్యారు.ఈ మేరకు రాజ్యసభ ఛైర్మన్ ఆయనను నామినేట్ చేయగా, ఈ నియామకం సెప్టెంబర్ 3 నుంచి అమల్లోకి వచ్చింది. మొత్తం తొమ్మిది మంది సభ్యులుండే ఈ కమిటీ ఎంపీల నివాస వసతి, వైద్యం, ఆహారం, టెలిఫోన్, రవాణా వంటి కీలక సదుపాయాల పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ.. తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు సభ్యుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలంలోని గ్రామ గ్రామాన వాడ వాడ లా శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా కృష్ణ మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు నూతన వస్త్రాలు ధరించి యువకులు యువకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు అలాగే అత్యంత ఉత్సాహంగా పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.

## ఎయిర్ ఇండియా విమానంలో కలకలం.. పైలట్‌కు డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్!




**విజయవాడ, కలంకౌంటర్ :** పూకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిర్ ఇండియా విమానంలో చోటుచేసుకున్న తీవ్రమైన ఘటనకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విమానం గాల్లో ఉండగా అదుపుతప్పిన ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ), విమాన పైలట్–ఇన్–కమాండ్ (పీఐసీ) మత్తు పదార్థం (సైకోయాక్టివ్ సబ్‌స్టెన్స్) సేవించినట్లు ప్రాథమిక నివేదికలో నిర్ధారించింది. ఇది అత్యంత తీవ్రమైన విషయమని పేర్కొంటూ నేడు నివేదికను విడుదల చేసింది.

## ఇంటింటికీ తెలుగుదేశం: 45 రోజుల లక్ష్యం ముందే పూర్తి.. కోటి కుటుంబాలను పలకరించిన టీడీపీ

- కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై టీడీపీ భారీ ప్రచార కార్యక్రమం
- 'ఇంటింటికీ తెలుగుదేశం' పేరుతో 45 రోజుల డోర్ టు డోర్ యాత్ర
- లక్ష్యానికి ముందే కోటి కుటుంబాలను సందర్శించి రికార్డు సృష్టించిన శ్రేణులు
- ప్రభుత్వ విజయాలను వివరిస్తూ, స్థానిక సమస్యలపై ఫీడ్‌బ్యాక్ సేకరణ
- కార్యకర్తలను అభినందించిన టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్

**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) చేపట్టిన బృహత్తర ప్రచార కార్యక్రమం 'ఇంటింటికీ తెలుగుదేశం – – 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' రికార్డు స్థాయిలో విజయవంతంగా కొనసాగుతోంది. 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటినీ పలకరించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం, నిర్దేశిత గడువు కంటే ముందే కోటికి పైగా కుటుంబాలను సందర్శించి చారిత్రక మైలురాయిని అందుకుంది. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తూనే, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగింది. ఈ చారిత్రక విజయంపై టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణుల కృషిని అభినందిస్తూ ఆయన ప్రత్యేకంగా స్పందించారు. "ఇంటింటికీ తెలుగుదేశం–2026 కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా కోటికి పైగా ఇళ్లకు తీసుకెళ్లిన కార్యకర్తలు, నేతలకు హృదయపూర్వక అభినందనలు. ఇంటింటి పర్యటనల్లో ప్రజలను కలిసి, ప్రభుత్వ పథకాలను వివరించిన తీరు అద్భుతం. కేవలం సందర్శించడమే కాకుండా, ఆయా కుటుంబాల సమస్యలు, స్థానిక అవసరాలు, ప్రభుత్వ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన తెలుగుదేశం కుటుంబానికి ధన్యవాదాలు" అని లోకేశ్ పేర్కొన్నారు. కార్యక్రమ నేపథ్యం, ప్రస్థానం వాస్తవానికి ఈ కార్యక్రమానికి జూన్‌లోనే బీజం పడింది. చంద్రబాబు జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు "సైకిల్ పవర్ చూపుదాం... ప్రజలకు చేరువవుదాం" నినాదంతో ఇంటింటి ప్రచారం చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సవరించిన షెడ్యూలును ప్రకటించారు. జులై 27 నుంచి 45 రోజుల పాటు నిరంతరాయంగా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రారంభానికి ఒకరోజు ముందు, జులై 26న చంద్రబాబు నాయుడు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అనుకున్నట్టుగానే జులై 27న నారా లోకేశ్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ఈ మహాయజ్ఞం ప్రారంభమైంది.

**లక్ష్యాలు, సాధించిన ప్రగతి..** కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి వంటి అంశాలను ప్రజలకు వివరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. దీంతో పాటు, గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను స్పష్టం చేస్తూ, ప్రజల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ సేకరించడం, తద్వారా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ యాత్ర పురోగతి అంచనాలను మించి సాగింది.

**నాయకత్వం, క్షేత్రస్థాయి పర్యవేక్షణ..** ఈ కార్యక్రమం విజయవంతం కావడం వెనుక నారా లోకేశ్ పర్యవేక్షణ కీలక పాత్ర పోషించింది.

# కలెక్టర్ తో కలసిపల్లెనిద్ర లో పాల్గొన్నఎమ్మెల్యే ఇంటూరి

-గ్రామంలో తిరుగుతూ మౌలిక వసతులు పరిశీలించిన కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామంలో కలెక్టర్ రాజాబాబు గురువారం రాత్రి పల్లెనిద్ర నిర్వహించారు.కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ , జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు.శుక్రవారం ఉదయాన్నే కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు గ్రామంలో కాలినడకన తిరిగి మౌలిక వసతులను పరిశీలించడంతోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చెత్త సేకరణ, ఓవర్ హెడ్ ట్యాంకు, పంట కాలువలు, ఉపాధి హామీ పథకం పనులు, అసంపూర్తిగా ఉన్న స్కూల్ భవనం, అంగన్వాడీ కేంద్రం, ఎలికేరు వాగును వారు పరిశీలించారు.ఈ సందర్భంగా చెరువు సమీపంలో ఎలికేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామ-స్తులు కోరారు. అలాగే గ్రామం మధ్యలో గుండా వెళ్లే పంట కాలువలను కాంక్రీట్ తో నిర్మించాలని కోరారు. 50 సంవత్సరాల నుంచి అటవీ భూముల్లో ఇళ్లు కట్టుకుని ఉంటున్నామని, తమకు ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ కాలనీల వాసులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ రాజాబాబు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ.... సమస్యలు తెలుసుకోవడం, వాటి పరిష్కారమే లక్ష్యంగా నియోజకవర్గంలో ఇప్పటివరకు నాలుగు మండలాల్లో పల్లెనిద్ర కార్యక్రమం జరిగిందని చెప్పారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 25 లక్షలతో చెమిడిదపాడు చెరువును అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున, మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, గ్రామటిడిపి అధ్యక్షుడు వర్ధినేని వెంకటరావు, క్లస్టర్ ఇంచార్జ్ చిత్తారి మల్లికార్జున, గ్రామ నాయకులు కారసాల శ్రీను, రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు కారసాల బ్రహ్మనాయుడు, చిత్తారి శ్రీను, మండల స్థాయి నేతలు పాల్గొన్నారు.

# శ్రీ పోలేరమ్మతల్లిని దర్శించుకున్నకమిషనర్ మహేశ్వరరెడ్డి

**కామేపల్లి, కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ పోలేరమ్మ తల్లి అమ్మవారిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మల్టీ జోన్ – 2 తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ బి.మహేశ్వర రెడ్డి శ్రీ పోలేరమ్మ వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రావణమాసం నాల్గవ శుక్రవారం దేవాలయములో జరుగుచున్న శ్రీ వరలక్ష్మీ అమ్మవారి వ్రతములందు పాల్గొని ఆలయ ప్రాంగణమంతా పరిశీలించి తదుపరి దేవస్థానము వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మరియు



దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశముల ప్రకారం జులై 26వ తేదీ నుండి ప్రవేశపెట్టిన అన్నదాన కార్యక్రమమును పరిశీలించి భక్తుల నుండి అన్నదానంపై వారి అభిప్రాయాలను తెలుసుకొని అన్నదానము రుచిగా మంచిగా ఏర్పాటు చేయుచున్నారని తెలిపియున్నారు. దేవాలయ ప్రాంగణంలో శానిటేషన్ మెరుగుపరచవలసినదిగా ఆదేశించి దేవాలయమునకు వచ్చు భక్తులకు ప్రత్యేక పూజలు సేవలు ఏర్పాటు చేయవలసినదిగా ఆదేశించారు. దేవాలయ ప్రాంగణంలో దేవతా వృక్షములు పెంచ వలసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పోటు పెదబాబు, ఈవో వై బైరాగి చౌదరి పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకలు




**హృదయాన్ని హత్తుకునే ప్రదర్శనలు:** పిల్లలు తమ లేత గొంతులతో పాడిన కృష్ణ భక్తి గీతాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి.

**భక్తి భావం – సంస్కృతీ సంప్రదాయాలు:** ఈ వేడుకల ద్వారా పిల్లలకు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయడమే తమ ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. శ్రీకృష్ణుని జీవితంలోని ముఖ్య ఘట్టాలను, ఆయన బోధించిన ధర్మ మార్గాన్ని ఉపాధ్యాయులు పిల్లలకు కథల రూపంలో వివరించారు. ఈ వేడుకలకు తల్లిదండ్రులు ప హాజరై పిల్లల ప్రదర్శనలను ఆస్వాదించారు. చిన్నారుల వేషధారణలు, వారి అమాయకపు నవ్వులు ప్రతి ఒక్కరి మదిలో చెరగని ముద్ర వేశాయి.

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** రాజు పేటలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రాంగణం ముద్దులొలికే చిన్ని కృష్ణులు, అందాల గోపికలతో బృందావనం తలపించింది. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యం ఎంతో ఘనంగా నిర్వహించిన ఈ వేడుకలు అందరి హృదయాలను హత్తుకున్నాయి.

**వేడుకల ముఖ్యాంశాలు:**

**చిట్టి కృష్ణులు, గోపికల సందడి:** ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో భాగంగా ఎల్.కె.జి, యు.కె.జి చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. నెమలి పించం, పిల్లనగ్రోవి చేతబట్టి చిరునవ్వులు చిందిస్తున్న ఆ చిన్నారులను చూస్తుంటే సాక్షాత్తూ ఆ బాలకృష్ణుడే దిగివచ్చాడా అనిపించింది.




# యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం బృందావన్ థియేటర్ నందు ఈరోజు కృష్ణాష్టమి సందర్భంగా బందరు నియోజకవర్గ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పల్లపాటి సుబ్రహ్మణ్యం (చినబాబు) ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలత గోపూజ అనంతరం శ్రీకృష్ణుడికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు బాలకృష్ణుడు మరియు రాధా వేషాలతో చూపరులను ఆనందింప చేశారు.ఈ కార్యక్రమానికి బందరు నియోజకవర్గ ప్రముఖులు అందరు హాజరైనారు. హాజరైన వారిలోకొల్లు రవీంద్ర, రొండి కృష్ణ, వేమూరి నాగార్జున, బండి రామకృష్ణ,పేర్ని కృష్ణమూర్తి(కిట్టు), కుంచె నాని,బొర్రా శ్రీనివాస్, గొరిపర్తి విశ్వనాథ బాబు,గొరిపర్తి బసవేశ్వర బాబు,బోయిన వెంకటేశ్వరరావు,పల్లపాటి చినబాబు,గొరిపర్తి రాము, ఆరేపు లక్ష్మణ కుమార్, దేవన బోయిన వెంకట కృష్ణారావు,ఎంపరాల సత్యనారాయణ, తోట నాంచారయ్య,సంద్రం సూర్య ప్రకాష్,నేలపాల రామ కృష్ణ, బోయిన అంతర్వేది, గంగుల నాంచారయ్య, దేవన బోయిన రామాంజనేయులు,చేయబోయిన నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# అంగ రంగ వైభవంగా పుట్టగుంట పెళ్లి వేడుకలు





**కంకిపాడు,కలంకౌంటర్ :** విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ , లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ పుట్టగుంట వెంకట సతీష్ కుమార్ కుమార్తె డాక్టర్ అన్విత నిశ్చయ తాంబూలాలు వేడుక కంకిపాడు ఆయాన్ కళ్యాణ్ మండపం లో ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐ.జి మొవ్వ వెంకట రాజేష్ కుమారుడు డాక్టర్ దివ్యంత చౌదరితో నిత్య తాంబూలాలు కార్యక్రమం కన్నుల పండుగ జరిగింది. శుక్రవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు జరిగిన ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వి రమణ,మాజీ మంత్రి దేవినేని ఉమా, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర,విజయవాడ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ పలువురు జిల్లా లయన్స్ మాజీ గవర్నర్లు పాల్గొన్నారు. సినీ సెట్టింగులు కల్పించే పూల డెకరేషన్ తో నిశ్చయ తాంబూలం జరిగింది.ఆహుతులు అందరికీ పుట్టగుంటవారు రెండు మొక్కలు గిఫ్ట్ గా అందజేశారు.

# భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీవ్రతోత్సవం





**కామేపల్లి,కలంకౌంటర్ :** కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. రంగురంగుల పూలతో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతాన్ని వందలాది మంది మహిళా భక్తులు వ్రతాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పండగ వాతావరణం నెలకొంది. ఆలయ ఛైర్మన్ పోటు పెదబాబు, ఈఓ బైరాగి చౌదరి ఏర్పాట్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

# నాణ్యమైన విద్యతోపాటు నైపుణ్యతను నేర్పించడం మా లక్ష్యం - కరస్పాండెంట్ డా" విజయ్ శ్రీనివాస్

**కందుకూరు,కలంకౌంటర్ :** నాణ్యమైన విద్యుత్ తో పాటు నైపుణ్యతను విద్యార్థులకు అందించటమే ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల లక్ష్యం అని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విజయ శ్రీనివాస్ అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 3, 2026 వరకు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో నిర్వహించిన మూడు రోజుల "సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్" వర్క్‌షాప్ శుక్రవారం విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన టీచ్ పీక్ సంస్థతో అనుబంధం కలిగిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు పి. కార్తీక్ కుమార్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, వెబ్ అప్లికేషన్ సెక్యూరిటీ, పెనిట్రేషన్ టెస్టింగ్ తదితర అంశాలపై సిద్ధాంతంతో పాటు హ్యాండ్స్-ఆన్ ట్రైనింగ్ అందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విలువైన అవగాహనతో పాటు ప్రాక్టికల్ అనుభవాన్ని సొంతం చేసుకున్నారని అన్నారు. "నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా ప్రాక్టికల్



నాలెడ్జ్‌ను పెంపొందించే ఇలాంటి శిక్షణా కార్యక్రమాలకు కళాశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది" అని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. సి. హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ , "అకడమిక్స్‌తో పాటు ఆధునిక టెక్నాలజీలపై అవగాహన, ప్రాక్టికల్ అనుభవం ఉన్నప్పుడే విద్యార్థులు పోటీ ప్రపంచంలో విజయవంతంగా రాణించగలరని అన్నారు, ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా. కె. సుబ్బారెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేశారు

# ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు






**కందుకూరు,కలంకౌంటర్ :** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో నిర్వహించిన వేడుకలు ఆధ్యాత్మికత, సంప్రదాయం, విద్యార్థుల ఉత్సాహం కలగలిసి కనులపండువగా సాగాయి. కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో లెమన్ అండ్ స్పూన్ రేస్, మ్యూజికల్ చెయిర్స్, టగ్ ఆఫ్ వార్, ఉట్టి కార్యక్రమం, కోలాటం తదితర పోటీలు సందడిగా జరిగాయి. ముఖ్యంగా కొత్తగా కళాశాలలో చేరిన ఫ్రెషర్స్ ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కోలాటం ప్రదర్శన ప్రేక్షకులను అలరించగా, ఉట్టి కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, కళాశాల శ్రేయోభిలాషులందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. "శ్రీకృష్ణుడు జ్ఞానం, ధైర్యం, నాయకత్వం, ధర్మం, సమయస్ఫూర్తికి ప్రతీక. ప్రతి విద్యార్థి ఆయన జీవితంలోని విలువలను ఆదర్శంగా తీసుకుని విద్యతో పాటు మంచి వ్యక్తిత్వాన్ని, నైతిక విలువలను అలవర్చుకోవాలి. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే గొప్ప వేదికలు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రవికుమార్, అకడమిక్ ఇన్‌చార్జి మీరవలి, డా. కె. పవని, డా. ఎస్.కె. సురియా షిహాబ్, డా. జి. ప్రసాద్ తో పాటు ఎస్ & హెచ్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ పరమాత్ముని అనుగ్రహం అందరికీ ఉండాలి-- ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** శ్రీకృష్ణ పరమాత్ముని అనుగ్రహం అందరికీ ఉండాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆకాంక్షించారు.శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా, ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో శుక్రవారంశ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే గకి స్వాగతం పలికారు. ఇంటూరి నాగేశ్వరరావు అక్కడున్నవారికి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, తేజ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి కొల్లు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాష్టమి సందర్భంగా మచిలీపట్నం బందరుకోట రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కృష్ణాష్టమి వేడుకలలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. వేణుగానంతో జగమంతా మురిపించిన బాలగోపాలుని కృపతో రాష్ట్రంలోని ప్రతి ఇంట సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యాలు ఎల్లప్పుడూ వర్ధిల్లాలని కోరుకున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.



# అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, శ్రీకృష్ణ కమిటీ చైర్మన్ గడ్డంరాజు నివాస ప్రాంగణంలో అత్యంత వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శుక్రవారం జవ్వారుపేటలో ఉన్న శ్రీకృష్ణ మందిరం నందు తొలిగా విగ్నేశ్వరుడు పూజను గావించి తదుపరి కృష్ణాష్టమిని పురస్కరించుకొని విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ,నగర ప్రమ ు ఖులు వేమూరి నాగార్జున, గొర్రెపాటి గోపీచంద్,బత్తిన దాసు ముఖ్య అతిథులుగా పాల్గొని కృష్ణాష్టమి విశిష్టతను తెలియజేశారు. అనంతరం కోలాటం శ్రీకృష్ణ లీలామృత గానం నిర్వహించారు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని యువకులు కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా గడ్డం రాజు ఆహ్వానించారు. ఉట్టికొట్టే యువతకు ప్రోత్సాహక నగదు బ హుమతి అందజేస్తామని ప్రధమ బహుమతి గా 3000వేల రూపాయల నగదు ద్వితీయ బహుమతిగా 2000వేల రూపాయల నగదు తృతీయ బహుమతిగా 1000 రూపాయల నగదు ఉంటుందనిఉత్సాహవంతమైన యువకులు ఉట్టికొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. నగర ప్రముఖులు బండిరామకృష్ణ, వేమూరి నాగార్జున, గొర్రెపాటి గోపీచంద్, బత్తినదాస్ లను శాలువాతో సత్కరించి గడ్డంరాజులితీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ న్యాయవాది గడ్డం విజయలక్ష్మి,పిప్పళ్ళ, కాం తారావు,ఫణి కుమార్ గోకుల్ శివ,అంకరాజు, వేమూరి మహర్షి,తోట రాజేష్, మహమ్మద్ సమీర్,వీరబాబు, కర్రీమహేష్, పినిశెట్టి వేణు, సుదర్శన్, మహమ్మద్ భాషి ,తోటపవన్, ఉడుముల బుజ్జి రాధిక, జన్ను నాగరాజు,గంపల కృష్ణ,కొక్కు లక్ష్మణ, రామ్ జ్యోతి, పలనియప్ప రెడ్డి కోటి,చలమల శెట్టి రమేష్, జొన్నల ప్రసాద్,పరిం కాయల లక్ష్మణ, బొమ్మసాని హరీష్,రామారావు,ఆలయ కమిటీ సభ్యులుజ్యోతి, సురేష్, విజయ,ఇందిర, రజిని, వాణి,సుమంత్,కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు జనసేన పార్టీకుటుంబ సభ్యులుభక్తులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



# జన్మదిన శుభాకాంక్షలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రముఖ గోల్డ్ వ్యాపారి ఉదయగిరి మురళీ జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి చిరు సత్కారం చేసిన శ్రీ లక్ష్మీ నృసింహ సోమయాజి వైశ్య సమాజం ప్రతినిధులు తుమ్మలపల్లి శ్రీనివాస్, పొట్టూరి కిరణ్,యండూరి శ్రీనివాస్ తదితరులు.

# జన్మదిన శుభాకాంక్షలు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** శ్రీ లక్ష్మీ నృసింహ సోమయాజి వైశ్య సమాజం కార్యవర్గ సభ్యులు జయవరపు ప్రసాద్ జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నృసింహ సోమయాజి వైశ్య సమాజం ప్రతినిధులు తుమ్మలపల్లి శ్రీనివాస్, పొట్టూరి కిరణ్,యండూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com